











రావి ఆకుపై అయోధ్య మందిరం చిత్రీకరణ


రావిఆకుపై అయోధ్య మందిరాన్ని చిత్రీకరిస్తున్న శృజన

అబిడ్స్: అయోధ్య బలరాముడి ప్రతిష్టాపన సందర్భంగా ఓ విద్యార్థిని రావి ఆకుపై అయోధ్య మందిరాన్ని చిత్రీకరించింది. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతున్న పోట్పల్లి శృజన తన కళాత్మకాన్ని అయోధ్య మందిరం రూపంలో రావి ఆకుపై చిత్రీకరించి అందరిని అబ్బుర పరిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని పోట్పల్లి శృజన మాట్లాడుతూ..తనకు చిత్రలేఖనం అంటే అమితమైన ప్రేమ అన్నారు. అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠ అవుతుండడంతో తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అయోధ్య సంబరాల వేళ విద్యార్థిని పోట్పల్లి శృజన చిత్రీకరణపై తోటి విద్యార్థినులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. ఒక ఆకుపై ఆలయాన్ని, సీతారాముల చిత్రాన్ని చిత్రీకరించడం ఎంతో వండర్‌ఫుల్ అని ఆమెను పలువురు ప్రశంసిస్తున్నారు.

సీతారాంబాగ్‌లో సీతారామ కల్యాణం


వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ మాధవీలత కొంపెల్ల

అబిడ్స్: అయోధ్యలో రామ మందిర ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని లతమా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత కొంపెల్ల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సీతారాంబాగ్ జగన్నాథ్ మఠంలో ఈ వేడుకలు కనుల పండువగా చేపట్టారు. ముందుగా త్రిదండి రామానుజ వ్రతధర్ జీయర్ స్వామి, మాధవీలత పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అయోధ్యలో రామ మందిర ప్రాణప్రతిష్ఠ అవుతుండడం 500 ఏళ్ల నాటి కళ నెరవేరిందన్నారు. ఈ వేడుకలకు భారీ ఎత్తున స్థానిక మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అజయ్‌స్వామి, టిల్లు కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, అనిల్ బజాజ్, ధినేష్ సింగ్, ఆంజనేయులు, టి.యమున్‌సింగ్, శంకర్‌రావు, పవన్, రాధాకృష్ణ, చిన్నా పాల్గొన్నారు.

'పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు'


మంత్రి శ్రీధర్‌బాబుతో కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ

గోల్కొండ: పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఘోర ఓటమి తప్పదని తెలంగాణ రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని సన్మానించారు. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకూ ప్రజాదరణ పొందుతుందని ఆయన మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లు తెలంగాణను దోచుకున్న బీఆర్‌ఎస్‌ను ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ఇంకా అనేక సంక్షేమ పథకాల జాబితా ఉందని ఎన్నికల హామీలు పూర్తయిన వెంటనే ఇతర సంక్షేమ పథకాలను కూడా ప్రారంభిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, అమీద్‌ఖాన్ ఉన్నారు.

నేడు జీఎన్‌ఐటీఎస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

గోల్కొండ: నేడు అయోధ్యలో జరగనున్న శ్రీరామ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకోని తమ కళాశాలలో కార్యక్రమ లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి తెలిపారు. కళాశాలలోని ఆడిటోరియంలో అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమం లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని దీంతో పాటు కళాశాలలో వేద పండితులచే ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో 21 సార్లు ఓంకార నినాదాలు, రాముడిపై శ్లోకాలు, రామభజన, హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు హనుమాన్ చాలీసా పఠనం, శేషాద్రి రామప్రతిష్ఠపై ప్రత్యేక ప్రసంగం, జ్యోతి ప్రజ్వాలన, మంగళ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు కుమ్మరివాడిలో ప్రాణప్రతిష్ఠ వేడుకలు


టపాసులను పంపిణీ చేస్తున్న నవరతన్ ఇందోరియ

జియాగూడ: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కుమ్మరివాడిలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవరతన్ ఇందోరియ అన్నారు. ఆదివారం కుమ్మరివాడి వాసులకు ప్రమిదలు, టపాసులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రాణప్రతిష్ఠ సమయంలో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకురాలు ఉమారాణి, అశ్విన్‌కుమార్, మాస్టర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండాల పంపిణీ



చార్మినార్: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో స్థానిక శ్రీరామ భక్తులు కాషాయ జెండాలను ప్రతిష్ఠించారు. చార్మినార్ పరిసరాలన్నీ కాషాయ మయమయ్యాయి. టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి గుల్జార్ హౌజ్, కోకర్‌వాడి, మామాజుమ్లా పాఠక్ తదితర ప్రాంతాలలో ఉచితంగా కాషాయ జెండాలను పంపిణీ చేశారు. గోవింద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సిటీ కాలేజీలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

చార్మినార్: స్వామి వివేకానంద, సుభాష్ చంద్ర బోస్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ కోఠి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ సిటీ కాలేజీలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. జిల్లాలోని అన్ని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ..ఉన్నత విద్యాభ్యాసంతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్, నగర కార్యదర్శులు రాహుల్, కౌశిక్‌లతో పాటు కాలేజీ కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి


విజయ్

లంగర్‌హౌస్: ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండలో నివాసముండే విజయ్‌కుమార్(37) సెంట్రింగ్ కాంటాక్టర్. మంగళ్‌హాట్‌లో నివాసముండే అతని మామ వద్ద కూడా ఉంటూ ఆయన కాంట్రాక్ట్ పనులు కూడా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం గండిపేట మండలం సన్‌సిటీలో పనులు చూసుకొని మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. లంగర్‌హౌస్ మిలటరీ ఆస్పత్రి దాటగానే అదుపు తప్పి కిందపడి తీవ్ర రక్తస్రావంతో మృతిచెందాడు. అతని మిత్రులు మృతదేహాన్ని నేరుగా ఉస్మానియా మార్చురీకి తరలించారు. రాత్రి 7 గంటలకు ఆస్పత్రి వైద్యులు లంగర్‌హౌస్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ సలహాదారుల నియామకాలపై హర్షం


సోమయ్య

నాంపల్లి: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ మల్లు రవి, సీఎం సలహాదారుగా మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ప్రొటోకాల్, ప్రజా సంబంధాల సలహాదారుగా వేణుగోపాల్‌ను నియమించడం పట్ల తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజా పాలనకు పెద్దపీట వేస్తుందనడానికి ఇదొక చక్కటి నిదర్శనమని పేర్కొన్నారు.

'పాశం' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీదత్త సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి వాసవదత్త రమణ రచించిన 'పాశం' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యానియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ..అమ్మమ్మ, తాతయ్య, మనుమళ్లకు ఉన్నటువంటి బంధాన్ని కథల రూపంలో రచయిత్రి ఎంతో చక్కగా వివరించారని కొనియాడారు. అనంతరం వంశీ కళా సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, రచయిత్రి సుదాదేవీలకు కామరాజుగడ్డ బాబురావు, సీతారావమ్మ గిరిజ 6వ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రధానం చే శారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆవుల మంజులత, సినీ దర్శకుడు అశోక్‌బాబు, సంస్థ అధ్యక్షులు కె.రమణ, ప్రధాన కార్యదర్శి వాసవదత్త రమణ పాల్గొన్నారు.

నేడు మహా పండుగ


దేవర శ్రీనివాస్

గోల్కొండ: నేడు ప్రపంచానికి మహా పర్వదినం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. దశాబ్దాల కల నేటితో సాకారమవుతుందని భవ్య అయోధ్య రామమందిర నిర్మాణం ఒక అద్భుత ఘట్టమని ఆయన అన్నారు. నేడు ప్రతి ఒక్కరూ తమతమ ఇళ్లను దీపాలతో అలంకరించాలని ఆయన కోరారు. బీజేపీ వారు అయోధ్యకు వచ్చే వారిని రైలు ద్వారా తీసుకువెళ్లి తిరిగి రామమందిరం దర్శనం అనంతరం ట్రైన్ ద్వారానే నగరానికి ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ఆధ్వర్యంలోనే వచ్చిన వారికి ఉచిత బస, భోజనం కల్పిస్తామని ఆయన అన్నారు. అయోధ్యకు వచ్చే వారు గుడిమల్కాపూర్‌లో తనను 99594 13332లో సంప్రదించాలని సూచించారు.

'స్పెల్ బీ మాస్టర్'గా నగర విద్యార్థి

సాక్షి సిటీ బ్యూరో: మిర్చి రేడియోతో కలిసి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహిస్తున్న దేశవ్యాప్త స్పెల్ బీ పోటీ 'స్పెల్ మాస్టర్స్ ఆఫ్ ఇండియా' రీజనల్ స్థాయిలో నగర విద్యార్థిని విజేతగా నిలిచింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆసిఫ్‌నగర్‌లోని మెస్కో గ్రేడ్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రుమైసా వాజిద్ (13) ఆదివారం నగరంలో జరిగిన రీజనల్ ఫైనల్స్‌లో గెలుపొందిందని, ఫిబ్రవరి 24న జరిగే గ్రాండ్ ఫైనల్‌లో దేశవ్యాప్తంగా ఇతర నగరాల విజేతలతో పోటీ పడనుందని వివరించారు.

























